'అగ్నిజ్వాల'

ఏ. వి. మోహన్రావ్

సాయంత్రం ఆరుగంటలయింది.

తెల్లటి బెంజ్‌కారు, తల్లైయారు రోడ్‌లోని ఆరో నెంబరు బంగళా ముందు ఆగింది. కాంపౌండ్ గేటు కున్న చైన్ లోపలి వైపు నుండి బిగించి వుండటంతో కారులో వున్న మనిషి ఘట్టిగా హారన్ ప్రోగించాడు.

బంగళా లోపల్నుండి సర్వెంట్ పరిగెత్తుకుంటూ వచ్చి చైన్ తప్పించి గేటు బార్లా తెరిచాడు.

కారు లోనికి దూసుకొచ్చింది. సర్వెంట్ ముందాగింది 'మైత్రేయగారున్నారా?' కారు వెనుకసీట్లో వున్న వ్యక్తి అడిగాడు.

"వున్నారు!" చెప్పాడు సర్వెంట్ మళ్ళీ గేటు మూసేందుకు ప్రయత్నం చేస్తూ.

కారు పోర్టికో వేపు కదలిపోయింది.

ఆగిన కార్లోంచి ముగ్గురు దిగారు. డ్రాయింగ్ రూం వేపు వెళ్ళారు. మైత్రేయ గుమ్మం దగ్గర నిలుచుని,

ముగ్గుర్నీ ఆహ్వానించాడు. అందరూ లోని కెళ్ళి కూర్చున్నారు.

"నా పేరు ఆనందన్. వీళ్ళిద్దరూ మా తమ్ముళ్ళు కుమరన్, రామన్." తన్ను పరిచయం చేసుకుంటూ, వెంటనున్న తన సోదరుల్ని కూడా పరిచయం చేశాడు.

'మిమ్మల్ని కలుసుకోవటం చాలా ఆనందంగా వుంది. నా వల్ల మీకేం కావాలి?' అడిగాడు మైత్రేయ.

"మాకు సినిమా కంపెనీ వుంది. నేను డైరెక్ట్ చేస్తుంటాను. కుమరన్ కెమెరామెన్‌గా, రామన్ ఎడిటర్‌గా వుంటాడు. మా కంపెనీ ఇప్పటికీ ఇరవై సినిమాలు తీసింది. మాకు స్వంత స్టూడియో కూడా వుంది. మీరు వినే వుంటారు ఆనంద్ స్టూడియో పేరు.' చెప్పి ఆగాడు ఆనందన్.

'విన్నాను!'

"మీరు రాసిన నవల 'అగ్నిజ్వాల' యీ మధ్య చదవడం జరిగింది. ఆ కథ మాకు నచ్చింది. దాన్ని భారీ ఎత్తున ఒకేసారి హింధీ, తెలుగు, అరవంలో తియ్యాలని సంకల్పించుకున్నాము. దాన్ని గురించి మాట్లాడేందుకు వచ్చాము." అన్నాడు.

'చాలా సంతోషం. నేను దాదాపు పదేళ్ళ నుంచి రచనలు చేస్తున్నాను. ఇంతదాకా నా నవలలు సినిమా తీస్తామంటూ వచ్చిన వాళ్ళు లేరు. అంటే అవి బహుశా సినిమాలకు పనికి రావని నా అభిప్రాయం. లక్షలు, కోట్లు, పెట్టుబడి పెట్టబోయే ముందు మీరు ఒకటికి పది సార్లు ఆలోచించుకోవడం మంచిదని నా అభిప్రాయం."
అన్నాడు మైత్రేయ అనాసక్తంగా.

'బాగా ఆలోచించుకునే మేము నిర్ణయానికి వచ్చాం.' అన్నాడు ఆనందన్.

' అయితే మీ యిష్టం! నేను చెప్పవలసింది చెప్పాను.'

'దీనికి స్క్రీన్ ప్లే కూడా మీరే తయారు చెయ్యాలి. అన్నింటికీ కలిపి మీకు లక్షరూపాయలివ్వాలనుకున్నాం. ఏమంటారు ?'

'స్క్రీన్ ప్లే అంటే ఏమిటో నాకు తెలీదు. అదెవరి చేతనన్నా అనుభవం వున్నవాళ్ళచేత రాయించుకుంటే బాగుంటుందేమో ?" తన అనుమానం వ్యక్తపరిచాడు మైత్రేయ.

"కాదు! మనం నలుగురం నాలుగు రోజులు కూచుని కూలంకషంగా చర్చించుకుంటే చాలు. ఆ తర్వాత మీకే అర్థమవుతుంది. మీరు రాస్తేనే బాగుంటుంది." అన్నాడు ఆనందన్.

'అలాగే !'

ఆనందన్ చెక్ బుక్ తీసి పాతిక వేల రూపాయలకు మైత్రేయ పేర చెక్ రాసి ఇచ్చాడు. దాన్ని అందుకున్నాడు మైత్రేయ.

"మంచి రోజు చూసి మీకు కబురు చేస్తాను. సిట్టింగ్స్ మొదలు పెడదాం. ఈలోగా మీ నవలను మీరు రెండుసార్లు చదవండి. ఏమేం మార్పులు, చేర్పులు చేస్తే బావుంటుందో ఆలోచించి వుండండి. మేము చదివి చర్చకు సన్నద్ధమవుతాం.' అన్నాడు ఆనందన్ లేస్తూ. కుమరన్, రామన్ కూడా లేచారు.

కరచాలనాల కార్యక్రమం ముగిశాక, మైత్రేయ

వాళ్ళను కారుదాకా సాగనంపి, లోపికొచ్చి కూర్చున్నాడు.

టీపాయ్ పైనున్న చెక్ ఫాన్ గాలికి రెపరెపలాడుతూ కనుపించింది. దాన్ని చూడగానే అతనికి గతం గుర్తు కొచ్చింది.

సరిగ్గా పది సంవత్సరాల నాడు కట్టుబట్టలతో, మండే కడుపుతో మద్రాసులో అడుగుబెట్టాడు. కనబడ్డ ప్రతి పత్రికాఫీసుకు తిరిగాడు ఉద్యోగం కోసం. ఎక్కడా దొరకలేదు. కార్పొరేషన్ కుళాయి నీళ్ళు త్రాగి, ప్లాట్ ఫామ్ పైన ఉంగచుట్టుకొని పడివున్న రోజులెన్నో గుర్తుకొచ్చాయి.

ఆరు మాసాల పోరాటం తర్వాత చిన్న ఉద్యోగం దొరికింది. ఆ తర్వాత అతని ప్రతిభా వ్యుత్పత్తులు అనేక మందికి తెలిసొచ్చాయి. చకచక పైకొచ్చాడు. అతనికి ఆంధ్ర దేశంలో ఎంతో పేరుంది. ఎంతోమంది పాఠకులు, ఆరాధకులున్నారు. స్వంత బంగళా, కారు, బ్యాంక్ అకౌంట్ ఏర్పడ్డాయి.

మైత్రేయకు హైద్రాబాదులో తన జీవితం గుర్తు కొచ్చింది. అక్కడా ఒంటరిగాడుగానే వుండేవాడు. తన రచనలను మెచ్చుకుంటూ చుట్టూ తిరిగే అనసూయ, ప్రేమించానంటూ మభ్యపెట్టి, పెళ్ళి చేసుకునేదాకా పోరాడింది. మైత్రేయ అసలు పేరు సుబ్బారావు ఆ రోజుల్లో.

అనసూయ అతనికన్నా పొడవులో ఆరంగుళాలు ఎక్కువ. చుట్టుకొలతలో దాదాపు పదిహేడు అంగుళాలు విశాలంగా వుంటుంది. ఆమె కంఠం, కంచు కంఠం. మాట్లాడుతుంటే మగాళ్ళు మాట్లాడుతున్నట్లుగా వుంటుంది.

తాళి కట్టింది మొదలు, అది ఎగతాళి పాలయ్యే దాకా, అంటే ఆరు సంవత్సరాల వైవాహిక జీవితంలో ప్రతి విషయంలో అతన్ని ఆమె చులకనగా చూసేది. ఆమె గతం అంత పవిత్రమైనది కాదన్న విషయం అతనికి ఆ తర్వాత అర్థమైంది. సంపాదన లేకుండా, భార్య డబ్బు పైన తిండికీ, గుడ్డకు ఆధారపడ్డ మగ వాళ్ళ జీవితం అంతా అంతేనని పించింది.

పెళ్ళయిన వెంటనే అనసూయకు ఆడ పిల్ల పుట్టింది. ఆ పిల్లకు సుశీల అని పేరు పెట్టుకున్నారు. ఎంతో ప్రేమగా పెంచాలని తహతహలాడే వాడు భర్తను బిడ్డపై చెయ్యి గూడా వెయ్యనిచ్చేది గాదు అనసూయ.

మానసికంగా బాగా కృంగి పోయాడు సుబ్బారావు ఆ రోజుల్లో. తెలిసిన వాళ్ళు అతన్ని అవహేళన చెయ్యడం, భార్య చులకనగా చూడడంగా, కన్న బిడ్డను కనీసం ప్రేమగా కౌగలించు కోలేక పోవడం వంటి సంఘటనలు, అతన్ని బాగా కృంగ దీశాయి. విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు.

ఆ విషయం అనసూయతో చెప్పాడు. ఆమె ఆనం దంగా ఒప్పుకొంది. కానీ కూతురు తన రక్షణలోనే వుండా లన్న మంకుపట్టు పట్టింది. దాంతో ఇద్దరూ కోర్టు కెక్కారు. కోర్టు కూడా అనసూయ కోరికనే మన్నిస్తూ, న్యాయం చెప్పడంతో, మద్రాసు చేరుకున్నాడు.

ఎప్పటి కయినా అనసూయ మారుతుందనీ, కన్న బిడ్డను తీసుకుని, తన దగ్గరకు వస్తుందనీ, అప్పటికి వీలయినంత సంపాదించి, వుంచాలన్న తపనతో, తంటాలు పడి అతనీ స్థితికి వచ్చాడు.

అతను రాసిన నవల సినిమా తీస్తామనగానే ఆనందం కలిగింది. ఇది మంచి పేరు తెస్తే త్వరలోనే తను లక్ష లకు లక్షలు సంపాదించడం సాధ్యమౌతుందన్న విష యం వూహించి ఆనందంతో ఉప్పొంగి పోయాడు మైత్రేయ.

'బాబూ !' పిలిచాడు సర్వెంట్.

"ఏమిటి?" అన్నట్లు తలెత్తి చూశాడు మైత్రేయ.

"గంట తొమ్మిదవుతుంది. భోజనం చెయ్యరా?"

"ఆకలి లేదు. నువ్వెళ్ళి తిను." అన్నాడు, లేచి బెడ్ రూంలోకి వెళ్తూ.

అతను, ఎదురుగా గోడకు వ్రేలాడుతున్న సుశీల ఫొటో వద్దకు నడిచాడు.

రెండు క్షణాలు ఆ ఫొటోలో వున్న కూతుర్ని నిశితంగా, నిదానంగా, నిర్మలమైన మనస్సుతో చూస్తూ నిలుచున్నాడు. ఆ తర్వాత చేతుల్లో వున్న చెక్ ఫొటోకు అభిముఖంగా పెట్టాడు. ఆమె కోసం తను సంపాదించిన మొత్తాల్ని అలా ఫొటోకు చూపించి, ఆ తర్వాత బ్యాంక్‌కు పంపడం అలవాటుగా పెట్టుకున్నాడు మైత్రేయ. ఆరోజు ఆ చెక్‌ను కూడా అలాగే చేశాడు.

2

ఆనంద్ స్టుడియోస్ వాళ్ళ ఆఫీసు ముందు వరుసగా నిలుచున్నారు అందమైన అమ్మాయిలు. దాదాపు పాతిక మందిదాకా వున్నారు. అందరూ అందంగా తయారయి సీతాకోక చిలుకల్లా వచ్చారు.

ఒక అమ్మాయి పరుగెత్తుకుంటూ వచ్చి ఆగింది వాళ్ళ ప్రక్కన. బట్టలు ఎగుడు దిగుడుగా వున్నాయి. తలంతా రేగివుంది. కాళ్ళకు చెప్పులు గానీ, చేతిలో బ్యాగ్ కానీలేవు.

'డైరెక్టరు' అని బోర్డువున్న రూం బైట నిలుచున్న బాయ్ ఆ అమ్మాయి వైపు వెళ్ళి "ఎవరునువ్వు?" అడిగాడు.

"కనిపించలా? మనిషివి!" అంది కోపంగా.

"ఎందుకిలా పరుగెత్తుకొచ్చావ్?"

"ఎవరో రౌడీలు వెంటపడ్డారు. వాళ్ళనుండి తప్పించుకుందామని పరుగెత్తాను. వీళ్ళంతా ఎందుకు నిలుచున్నారు?" అడిగిందా అమ్మాయి.

"మా అయ్యగారు క్రొత్త సినిమా మొదలెట్టబో తున్నారు. అందులో హీరోయిన్ వేషం కోసం వచ్చారు." అన్నాడు బాయ్.

"అలాగా? అంది ఆశ్చర్యంగా.

"నువ్వేంచేస్తుంటావ్?"

"ఏదైనా పనికోసం వెతుక్కుంటూ వచ్చాను. మా అమ్మా నేనూవచ్చాము. ఆమె రాత్రి చచ్చిపోయింది. మా నాన్న ఈ ఊళ్ళోనే వున్నాడని తెలుసు. కానీ ఎక్కడున్నాడో తెలియదు. ఆయన్ను రెండు మాసాల నుండి వెతుకుతున్నాం." అందా అమ్మాయి.

"నీ పేరేమిటి?"

"రజని." చెప్పిందా అమ్మాయి.

"బావుంది!"

"ఏమిటి?"

"పేరూ, నువ్వూ, రెండూ బావున్నాయి."

"ఏదైనా పని దొరుకుతుందా ఇక్కడ" అడిగింది ఆశగా రజని.

"ఏమేం పనులు చెయ్య గలవు?"

"తిండీ గుడ్డా ఇస్తే ఏదైనాచెయ్యగలను. ప్రస్తుతం అంతే నా అవసరం." అంది రజని భయంగా వీధికేసి చూస్తూ.

లోపలినుండి బెల్ వినిపించడంతో "ఇక్కడేవుండు. వస్తాను." అంటూ లోనికెళ్ళాడు. ఒక నిముషం తర్వాత వెలుపలికొచ్చి, హాల్లో నిలుచున్న మరో అమ్మాయిని లోనికి పంపి, రజని దగ్గరకు నడిచాడు భాయ్.

"నా యిల్లు వెనుక వేపుంది. నేను ఒక్కడ్నేవుంటున్నాను. అక్కడికి ముందు స్నానంచేసి, క్యారియర్‌లో అన్నం తిని పడుకో. ఈ హడావుడి ముగిశాక వచ్చి మాట్లాడు తాను. సరేనా?" అడిగాడు భాయ్.

సరేనన్నట్లు తలూపింది రజని.

ఆమెను తీసుకెళ్ళి, వెనుకవేపు తనుంటున్న ఔట్ హవుస్‌లో దిగవిడచి మళ్ళీ ఆఫీసుకు వచ్చాడు భాయ్.

రజని హాయిగా స్నానం చేసి, అతని పాంటు, షర్టు, వేసుకుని, క్యారియర్ తెరచి అందులో వున్న, అన్నం కూర, పులుసు, పెరుగు మొత్తం తిని, గిన్నెలు శుభ్రంగా కడిగి, యధాస్థానంలో పెట్టి పడుకొంది. ఆమెకు తెలీకుండానే నిద్రపట్టింది.

"రజనీ! రజనీ!!" అన్న పిలుపు విని తలెత్తి చూసింది. ఎదురుగా భాయ్ నిలుచుని వున్నాడు.

"నీ పనంతా అయిపోయిందా!" అడిగింది రజని

లేచి కూర్చుంటూ.

"అఁ! అయినా అలా మొద్దులా నిద్రపోతున్నా వేమిటి?" అడిగాడు బట్టలు మార్చుకుంటూ.

"అన్నం తిన్నావా?"

"ఆఁ నేను వెళ్ళి హోటల్లో తిని వచ్చాను." అన్నాడు భాయ్.

"నీ పేరు!"

"నా ఉద్యోగం ఆఫీసు బాయ్ అనుకో. నీకు నేను భాయీని. అంటే అన్నయ్యను అందంగా భాయీ అని పిలువు. చాలు" అన్నాడు అతను.

"అలాగే!" అంది రజని.

మంచం మీద రజనికి కొంచెం దూరంగా కూర్చు న్నాడు భాయీ. రజని కేసి కన్నార్పకుండా చూస్తుండి పోయాడు ఒక క్షణం సేపు.

"ఏంటి భాయీ! అలా చూస్తున్నావ్?"

"ఏం లేదు?"

"లేదంటూనే చూస్తావెందుకు?"

"ఇంత అందం, వయస్సు, పెట్టుకుని, ఈ ఊళ్ళో ముఖ్యంగా ఈ సినిమా కంపెనీల నడుమ, క్షేమంగా ధైర్యంగా ఎన్నాళ్ళు తిరగ గలవాని చూస్తున్నాను." అన్నాడు భాయ్.

"అంటే ఇక్కడంతా రాక్షసులున్నారా?"

'వీళ్ళ ముందు వాళ్ళు కూడా సిగ్గుతో తలవంచు కోవలసిందే!' అన్నాడు తన అనుభవాన్నంతా నెమరు వేసుకుంటూ.

"అయితే నాలాంటి వాళ్ళు బ్రతకలేరంటావ్?" అను

మానంగా చూస్తూ అడిగింది రజని.

'దానికి కొన్ని మెళకువలున్నాయి అవి తెలుసుకుంటే వీళ్ళను అండిచవచ్చు. నీ చుట్టు త్రిప్పుకోవచ్చు."

"అవన్నీ నాకు నేర్పుతావా?"

'ఆఁ!'

"కొన్నాళ్ళపాటు నువ్వు ఎవ్వరికంటాపడకు. ఇక్కడే గదిలో వుండు. ముఖ్యంగా, మా ప్రొప్రయిటర్లు చూడకుండా జాగ్రత్తపడు." అన్నాడు భాయ్.

'అలాగే!' అంది రజని.

'నువ్వెంతదాకా చదివావ్ ?'

'పదో తరగతి.'

'నాటకాల్లో వేషాలు వేశావా ?'

"ఆఁ దాన్నుకూడా వచ్చు." అంది రజని.

"అయితే నిన్ను హీరోయిన్ని చేస్తాను. ధైర్యంగా వుండు. అయితే ఒక్క షరతు నువ్వు గొప్పదానివయ్యాక నన్ను మర్చిపోగూడదు. నన్ను నీతోనే నీ అన్నయ్యగా వుంచుకోవాలి." అన్నాడు.

"నువ్వు వదలి వెళ్తానన్నా నేను వెళ్ళనివ్వను. ఇవాళ కాలేకడుపుకు గంజిపోశావ్. ఎవ్వరూ లేని నాకు, అండగా, అన్నయ్యగా వుంటానన్నావ్. ఈ మేలు మరచిపోయే దుర్మార్గురాల్ని కాదు" అంది రజని.

'రాత్రికి వంట ఇంట్లోనే చేసుకుందాం. కావలసినవన్నీ వున్నాయి. సరుకులు తెస్తాను. రొమ్మిదింటికల్లా భోజనం కావాలి. ఆ తర్వాత నాకు పన్నెండుదాకా ఆఫీసులో పనివుంటుంది. అక్కడ్నుంచి కేకలు, అరుపులు, నవ్వులు, లాంటివి వినదిడ్డా భయపడకు తలుపు మూసుకు

పడుకో. నే నొచ్చి పిలిస్తేనే తలుపు తెరువు. సరేనా ?"

సరే నన్నట్లు తలూపింది రజని.

భాయ్ సంచి తీసుకుని వెలుపలకు వెళ్ళాడు సరుకులు తెచ్చేందుకు. రజని తలుపులు మూసుకుంది.

తన్ను హీరోయిన్ చేస్తానని అతనన్న మాటలు చెవుల్లో మారు[మోగాయి. విమానంలాంటికారు, లంకంత బంగళా, నౌకర్లు, బోలెడుడబ్బు, చీరలు, నగలు, అన్నీ వుంటాయి. ఎక్కడికి వెళ్ళినా తన్ను చూడను ఎగబడే వేలమంది జనం. తలచుకొంటేనే ఒళ్ళు గగుర్పాటు చెందింది.

ఊహాలోకంలో విహరించిన మనస్సు తలుపు పైన ధబధబ మని శబ్దం కావడంతో రెక్కలు తెగిన పక్షిలా ఇహలోకంలోకి దిగింది.

మంచంపై నుండి దిగి, మెల్లగా వెళ్ళి తలుపు వద్దగ నిలుచుంది.

"రాజూ ! రాజూ !" అంటూ పిలుపు వినబడింది. భాయ్ పేరు రాజన్న విషయం అప్పుడుఅర్థమైంది రజనికి.

తలుపు తియ్యటమా ? మానటమా ? అన్న సందేహంతో బదులు చెప్పకుండా అక్కడే నిలుచుంది కాసేపు.

అవతలివ్యక్తి తలుపు బాదడం ఆపక పోవడంతో, ధైర్యం చేసుకుని తలుపు తెరచింది.

ఎదురుగా, ఎత్తుగా వున్న మనిషి నిలుచుని వున్నాడు.

'నువ్వెవరు ? రాజులేడా ?'

'లేడు !' అంది రజని.

'నువ్వెవరో చెప్పలేదు ?'

'అతని చెల్లెల్ని'

'నీలాంటి అందమైన చెల్లెలుందన్న విషయం వాడు నాకెప్పుడూ చెప్పలేదు. వాడొచ్చేదాకా వుందొచ్చా ?' అడిగాడు అతను.

"వీల్లేదు. అన్నయ్య రావడానికి చాలాసేపు పడు తుంది. మళ్ళీరండి!" అంటూ అవతలి వ్యక్తి సమా ధానం కోసం చూడకుండా తలుపులు ఠక్కున బిగిం చింది రజని.

3

హాల్లోనున్న ఫోన్ గణగణ మంది.

మైత్రేయవెళ్ళి రిసీవరు అందుకొని "హల్లో! మైత్రేయ మాట్లాడుతున్నాను!" అన్నాడు మెల్లిగా.

"నేను ఆనందన్‌ను. ఇవాళ రాత్రి తొమ్మిది గంట లకు మన పిక్చరు షూటింగు ప్రారంభం చేద్దామను కుంటున్నాను. మీరు ఖాళీగానే వుంటారా?"

"అఁ!"

"అయితే నేను కారు పంపుతాను. వచ్చెయ్యండి. భోజనం కూడా ఆఫీసులోనే ఏర్పాటు చేస్తాను."

'అలాగే!' అన్నాడు మైత్రేయ.

'ఎనిమిదిన్నర కల్లా సిద్ధంగా వుండండి.' అంటూ అవతలవేపు ఫోన్ పెట్టేశాడు ఆనందన్.

మైత్రేయ కూడా రిసీవరు క్రిడిల్ పైన పెట్టి, అగ్ని జ్వాల నవల ఒక మారు చదువు కోవడం మంచిదని లైబ్రరీలోకి అడుగు పెట్టాడు.

వర్దెంట్ లైబ్రరీలో కొచ్చి 'అయ్యగారూ!" అని పిలిచాడు.

చదువుతున్న పుస్తకంలోంచి తల పైకెత్తి చూసి 'ఏమిటి?' అని అడిగాడు మైత్రేయ.

'మిమ్మల్ని చూడాలని ఎవరో వచ్చారు. అతన్ని చూస్తారా? లేక వీలుకాదని చెప్పి పంపెయ్యమంటారా?' అడిగాడు.

'ఎందుకో చెప్పాడా?'

"లేదు!"

"సరే హాల్లో కూర్చోబెట్టు! వస్తాను." అన్నాడు పుస్తకం మూసి పెడుతూ.

మైత్రేయ హాల్లో కొచ్చేసరికి, సోఫాలో కూర్చుని వున్న పాతికేండ్ల మనిషి లేచి నిలుచుని రెండు చేతులూ జోడించి నమస్కారం చేశాడు. అతన్ని కూర్చోమని చేత్తో సంజ్ఞచేసి, తనూ అతని కెదురుగా వున్న సోఫాలో కూలబడ్డాడు.

"నా పేరు రాజు," అన్నాడు అతను కూర్చుంటూ.

'మంచిది, నాతో ఏం పని?'

'చెప్తాను. మీరు రాసిన నవల "అగ్నిజ్వాల"ను సినిమాగా తీసేందుకు ఆనంద్ స్టూడియోస్ వాళ్ళు కొన్నట్లు తెలిసింది అందులో హీరోయిన్ వేషానికి, క్రొత్త అమ్మాయిని పెట్టాలని వాళ్ళు నిర్ణయించు కున్నారు. అందు కోసం అడ్వర్టయిజ్మెంట్ ముందే వేశారు. చాలా మందిని ఇంటర్వ్యూ చేశారు. నాకో చెల్లె లుంది. చాలా అందంగా వుంటుంది. చదువుకుంది. నాట కానుభవం కూడా వుంది. మీరు వాళ్ళకు మట్టిగా చెబితే

హీరోయిన్ వేషం యిస్తారు." అన్నాడు రాజు ఆశగా.

'ఆ ఇంటర్వ్యూకు మీ చెల్లాయిని కూడా పంపక పోయారా?' అడిగాడు మైత్రేయ.

"పంపేవాణ్నే! ఆ అన్నదమ్ములు ముగ్గురూ నర రూప రాక్షసులు. అలా వచ్చిన అమ్మాయిల్ని ఆశ పెట్టి వాళ్ళ శీలాన్ని, యవ్వనాన్ని జుర్రుకుని త్రాగి, ఆతర్వాత తరిమిపేస్తారు. క్రొత్తవాళ్ళను పెట్టుకుంటామని చెప్పేది ఇందుకోసమే! కానీ ఖర్చులేకుండా, కావలసిన ఆనందం పొందడానికి అలవాటు పడ్డారు. అందుకనే పంపలేదు." అన్నాడు రాజు కోపంగా.

"ఈ విషయం నీకెలా తెలుసు?"

'నేను వాళ్ళ కంపెనీలో బాయ్‌గా పనిచేస్తూ, వాళ్ళ వెధవ పనులకు సాయం చేస్తున్నాను గనుక....'

"ఐ. సీ. అలాంటి మనుషులు నేను చెప్తే మాత్రం వింటారా? విన్నా ఆ అమ్మాయిని మోసం చెయ్యరని గ్యారంటీ ఏమిటి?"

'ఆ అమ్మాయి నా చెల్లెలని తెలిస్తే, నా అనుమతి కోసం కూడా చూడకుండా, లాక్కెళ్ళి పాడుచేస్తారు. మీలాంటి వారి అండ దొరికితే, భయంతో నన్నా కాస్త దూరంగా వుంటారని నా నమ్మకం.' అన్నాడు రాజు.

"ఆ మాత్రం అండగా వుండేందుకు మరెవ్వరూ లేరా?"

"లేరు సార్! నాకు తెలిసినవన్నీ పశువులే!" అన్నాడు రాజు.

మైత్రేయ మాట్లాడకుండా ఆలోచిస్తూ చూస్తున్నారు.

"ఏమంటారు సార్ ?" తన విన్నపం మళ్ళా గుర్తు చేశాడు.

"నాకు అంత బాగా తెలీని గొడవలు. పైగా నువ్వు నాకు పూర్తిగా తెలియదు. పరిచయం కూడా లేదు. నీ మాటలు నమ్మి, ఈ రొంపిలోకి దిగడానికి మనస్కరించడం లేదు. అసలు నాకు సినిమా మనుషులన్నా, వాళ్ళతో పరిచయాలన్నా ఇష్టం వుండదు ?' అన్నాడు మైత్రేయ.

"అయితే నాకు సాయం చేయనంటారు ! అంతేనా?"

"అంతే ననుకుంటాను." అన్నాడు ఎటో చూస్తూ.

"వస్తాను సార్. నా తిప్పలు నేను పడతాను." అంటూ రాజు లేచి నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళినంతదూరం చూస్తూనే కూర్చున్నాడు మైత్రేయ. తనవల్ల ఇంతదాకా ఎవరికీ మంచిగానీ,సాయంగానీ జరగలేదన్న విషయం అర్థమైంది. అలాంటి అవకాశమేదో వస్తే, చేజేతులా దాన్ని జార విడుచుకున్నానేమో నన్న బెంగకూడా కలిగింది.

4

టెలిఫోన్ మ్రోగింది.

మైత్రేయ రిసీవరు తీసి "హల్లో !" అన్నాడు.

అవతలవేపు నుండి "నేను ! ఆనందన్‌ను మాట్లాడుతున్నాను. ఈ దినం మనం కలుసుకుందాం అనుకున్నాం. అది వాయిదా వేసుకుందాం." అన్నాడు.

"ఎందుకని ?"

"మా దగ్గర పనిచేసే రాజు అనే కుర్రాడు ఒకహత్య

కేసులో ఇరుక్కున్నాడు. మేమీ గొడవలో పడ్డాం."

"రాజు హత్య చేశాడా?" ఆశ్చర్యంగా అడిగాడు మైత్రేయ.

"అతను మీకు తెలుసా?"

"కొద్దిగా తెలుసు! ఎవర్ని హత్య చేశాడు?"

"ఎవరో 'రజని'అనే అమ్మాయిని గొంతుపిసికి చంపి కూం రివర్‌లో శవాన్ని పడేశాడు. దాన్ని వెలుపలకు లాగారు పోలీసులు. పోస్టుమార్టం చేయించారు. హత్యకు ముందు ఆ అమ్మాయిని ఘోరంగా మానభంగం చేసినట్లు రుజువైంది." చెప్పాడు ఆనందన్ హడావిడిగా.

"అలాగా?"

"మా దగ్గర నమ్మకంగా చాలా రోజుల్నుంచి పని చేస్తున్నాడు. ఇంతటి కర్కోటకుడన్న విషయం మాకు తెలీదు. నేరం చేసింది వాడయితే మమ్మల్ని వేధిస్తున్నారు పోలీసులు!"

"ఎందుకు!" అర్థం గాక అడిగాడు మైత్రేయ.

"వాడి పుట్టుపూర్వోత్తరాలు చెప్పమని...." అంటూ ఆపి, "ఇదేదో వదిలించుకునేందుకు దాదాపు రెండు దినాలు పడుతుంది. ఆ తర్వాత మీకు ఫోన్ చేస్తాను." అన్నాడు ఆనందన్.

"అలాగే!" అంటూ ఫోన్ పెట్టేశాడు మైత్రేయ.

అతనికి ఒళ్ళంతా చెమటలు పట్టింది. రజని అనే అమ్మాయి చెల్లెలంటూ, సాయం చెయ్యమని వచ్చి అడిగిన రాజు, అంత దారుణంగా, ఎలా హత్య చేసి వుంటాడో అర్థం కాలేదు. రాజు మాటలు, రూపు అన్నీ గుర్తొచ్చాయి. ఇందులో ఏదో నిగూఢ రహస్యం దాగి

వుందని అనుమానం వచ్చింది మైత్రేయకు.

గబగబ డ్రెస్ వేసుకుని నుంగంబాకం పోలీస్ స్టేషనుకు వెళ్ళాడు మైత్రేయ. పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు తనను తాను పరిచయం చేసుకుని, రాజును చూడాలన్నాడు. లాకప్ రూంలో వున్న రాజును చూపించాడు అతను.

మైత్రేయను చూడగానే రాజు పెద్దగా ఏడిచాడు. అతని కళ్ళు కన్నీటి సుడిగుండాల్లా మారాయి.

"ఏం జరిగింది ?" అడిగాడు మైత్రేయ.

"అనుకొన్నదే జరిగింది సార్ ! ఆ అమాయకురాల్ని వాళ్ళు అన్యాయం చేశారు." అన్నాడు రాజు.

'పోలీసులకు చెప్పలేదా!'

'చెప్పాను.'

'వాళ్ళేమంటారు?'

"డబ్బు లేని వాణ్ని కాబట్టి నా మాటలు నమ్మడం లేదు. నేనే చేశానంటారు. చెల్లెలులాంటిదాన్ని అలాంటి అవమానం పాలు చేస్తానా ? నేను మనిషిని సార్!" ఏడుస్తూ చెప్పాడు రాజు.

'బాధపడకు! నాచేతనైన సాయం చేస్తాను. ధైర్యంగా వుండు ,అంటూ ఇన్‌స్పెక్టర్ దగ్గరకు వచ్చి కూర్చు న్నాడు మైత్రేయ.

హత్య చెయ్యబడిన అమ్మాయి తాలూకు వివరాలు తెలిసినంత వరకూ చెప్పాడు ఇన్‌స్పెక్టర్. ఆ తర్వాత రజని ఫొటోలు కొన్ని చూపించాడు.

వాటిని చూడగానే మతి పోయింది మైత్రేయకు. ఆమె సుశీలేనని, తమ కన్న కూతురని తెలుసు కోవ టానికి, ఎక్కువ ప్రయాసపడవలసిన అవసరం లేక

పోయింది. గుండెల్ని చిక్కబట్టుకొన్నాడు.

'ఈ అమ్మాయి ఇతని స్వంత చెల్లెలులా లేదే?' అన్నాడు మైత్రేయ.

"అవును సార్! మేమూ విచారించాం! చెల్లెలు కాదు. ఆ అమ్మాయికో తల్లి వుండేది. ఆమె పేరు అనసూయ. ఆమె చని పోయింది. ఆ తర్వాత ఇతని పంచన చేరింది. వేషాలిమ్మంటూ చాలా మంది చుట్టూ తిరిగినట్లు సాక్ష్యాలు దొరికాయి అందరూ పిచ్చి పిచ్చి వేషాలు వెయ్య బోవడంతో, దూరంగా వచ్చేసిందట" చెప్పాడు ఇన్స్పెక్టర్.

'థాంక్స్! వస్తాను.' అంటూ శెలవు పుచ్చుకుని వెలుపల కొచ్చి కారెక్కి, తిన్నగా నుంగంబాకంలోని ఆనంద్ స్టుడియో వైపు పోనిచ్చాడు.

మైత్రేయ వెళ్ళే సరికి అన్నదమ్ములు ముగ్గురూ కూర్చుని ఏదో సీరియస్‌గా మాట్లాడు కొంటున్నారు. మైత్రేయను చూచి ఠక్కున మాటలు మానేశారు.

"ఏంటిలా వచ్చారు?" అడిగాడు ఆనందన్.

'మళ్ళీ ఫోన్ చేస్తామన్నాంగా?' అడిగాడు కుమరన్. మూడో అతను మాట్లాడకుండా కూర్చున్నాడు.

'మీతో కొద్దిగా మాట్లాడుదామని వచ్చాను.' అన్నాడు మైత్రేయ కూర్చుంటూ.

'చెప్పండి!' అన్నాడు ఆనందన్.

'అగ్నిజ్వాల నవల సినిమా తీసేందుకు మీకు ఇచ్చిన హక్కుల్ని తిరిగి తీసుకుంటున్నాను. మీ డబ్బు త్రిప్పి పంపుతాను.' అడిగాడు సీరియస్‌గా.

"ఉన్నట్టుండి ఎందుకిలాంటి నిర్ణయం తీసుకున్నారు?" అడిగాడు ఆనందన్ విస్తుపోతూ.

'కారణాలు మీ కనవసరం.' అన్నాడు మైత్రేయ.

'సారీ! మేం అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం. ఇప్పుడు దాన్ని మానెయ్యడం సాధ్యం కాదు.' అన్నాడు కుమరన్.

"బాగా ఆలోచించుకోండి!' అన్నాడు మైత్రేయ.

'ఇందులో ఆలోచించవలసిందేమీ లేదు' అన్నాడు కుమరన్.

మైత్రేయ అక్కణ్ణించి బయలుదేరి వచ్చేశాడు. అతని వంట్లోని రక్తం ఆవేశంతో బాగా ఎరుపెక్కిపోయినట్లు, సెగలు గ్రక్కుతూ ప్రవహిస్తున్నట్లు తోచింది. ప్రతీకారం సాధించాలనుకున్నాడు.

ఇంటికి తిరిగిరాగానే రెండు మూడు ఫోన్‌లు చేశాడు. బట్టలు మార్చుకుని, కారెక్కి, మౌంట్ రోడ్ వెళ్ళాడు. రెండు మూడు రకాల మందులు కొనుక్కొని వచ్చాడు. వాటితో కొన్ని ప్రయోగాల లాంటివి చేసి, పసుపు రంగులో వున్న మాత్రలు తయారు చేసి ఒక చిన్న సీసాలో తీసుకున్నాడు. దాన్ని కోటు జేబులో పెట్టుకున్నాడు.

హాల్లో వున్న ఫోన్ మ్రోగింది.

రిసీవరు పైకెత్తి 'హల్లో' అన్నాడు.

'నేను ఆనందన్‌ను మాట్లాడుతున్నాను. మీ లాయరు ఫోన్ చేశాడు. మన అగ్రిమెంటు చెల్లదంటూ కోర్టులో కేసు వెయ్యమన్నారట. నిజమేనా?' అడిగాడు.

'అు! నిజమే!'

'మమ్మల్ని ఇలా ఎందుకు ఇరుకున పెడతారు. ఇంకా

కొంత డబ్బు కావాలంటే ఇస్తాం!' అన్నాడు.

'మీరా కథ సినిమా తియ్యాలంటే నావి కొన్ని కండిషన్లు వున్నాయి. మీ అన్నదమ్ములు ముగ్గురూ ఈ రాత్రికి మా యింటికి రండి. అన్నీ వివరంగా చెప్తాను.'

'ఎన్నింటికి రమ్మంటారు?'

'ఏడింటికి రండి!'

'ఓ. కే. అలాగే వస్తాము.'

ఫోన్ డిస్కనెక్ట్ కాగానే, మైత్రేయ రిసీవరు క్రేడిల్ పైన పెట్టాడు.

అతని ఆలోచనల నిండా సుశీలే మెదలసాగింది. రాజు వచ్చి తనను బ్రతిమిలాడినప్పుడు సరేనని ఒప్పుకొని వుంటే, ఆమెను తను చూడగలిగే వాడు. గుర్తు పట్టాక ఆమెకు సినిమాలో చేరే అవసరం లేకుండా చేసే వాడు.

ఎవరి కోసమైతే ఇన్నాళ్ళు తపించాడో, ఆ బిడ్డ తన కళ్ళముందే దారుణంగా మానభంగం పాలై, మరణించడం, మనోవికారాన్ని, విచారాన్ని, కలిగించింది. ఆమెను తిరిగి బ్రతికించుకోవడం సాధ్యం కాదు. కనీసం పగ తీర్చుకోగలిగినా చాలనిపించింది.

5

ఏడు కొట్టేసరికి, కారు హారన్ వినిపించింది. మైత్రేయ పోర్టికోలో కొచ్చి నిల్చున్నాడు.

ఆగిన అంబాసిడర్ కార్లోంచి, ఆనందన్ ఒక్కడే దిగాడు. "నమస్తే సార్!" అన్నాడు ఆనందన్.

"వాళ్ళేరి?"

''వస్తుంటారు.'' చెప్పాడు.

ఇద్దరూ లోపలికి వెళ్ళారు.

కుర్చీలో కూర్చున్నాక ''చెప్పండి!'' అన్నాడు ఆనందన్.

''వాళ్ళను కూడా రానివ్వండి!''

''అవసరం లేదు. అందరి తరపున నిర్ణయాలు తీసుకునే అధికారం నాకుంది.''

''రైట్! మీ కంపెనీ గురించి నేను చాలా చెడ్డ విషయాలు విన్నాను. కొన్ని కథల్ని యిష్టమొచ్చినట్లు మార్చడం, వేషాలు ఇస్తామంటూ అందమైనఅమ్మాయిల్ని నమ్మించి, వాళ్ళను మానభంగం చెయ్యడం, ఎవరైనా ప్రతిఘటిస్తే,వాళ్ళను చంపడానికైనా సిద్ధపడటం, డబ్బు బలంతో ఆ కేసులు మీ పైకి రాకుండా, తప్పించుకోవడం మొదలైనవి. అలాంటివాళ్ళు నా కథలు సినిమా తీయడం నా కిష్టం లేదు.'' అన్నాడు మైత్రేయ.

''ఇవన్నీ మీకెవరు చెప్పారు?''

''నేను నమ్మే మనుషులు!''

''వాళ్ళకు మా పైన ఏదైనా కక్ష వుండాలి. లేకుంటే ఇలా కల్పించి కట్టుకథలు చెప్పరు. వ్యాపారంలో మాకు చాలామంది పోటీదారులు వున్నారు. 'అగ్నిజ్వాల' మేము కొన్నాక, అయ్యో మనం కొంటే బాగుండేదన్న దృష్టితో ఇలాంటి నీచానికి పాల్పడి వుంటారు'' అన్నాడు ఆనందన్.

''అయితే మీరు మంచివాళ్ళమంటారా?''

''ఖచ్చితంగా!''

''మీ ఆఫీస్ బాయ్ రాజు ఒక అమ్మాయిని మాన

భంగం చేసి చంపారు. తెలుసు కదూ !"

"తెలుసు !"

"అంతకన్నా వేరే ఉదాహరణ ఇంకేం కావాలి ?"

"అంటే...."

"మీ దగ్గర పని చేసే వాళ్ళు అంత దారుణం చేస్తుండగా, మీరు చెయ్యరని ఎందుకనుకోవాలి !"

'వాడ్ని మేమే పోలీసులకు పట్టిచ్చాం. అవసరమైన సాక్ష్యం చెప్పాం. ఇంతకన్నా మా విజాయితీకి వేరే ఆధారం కావాలా ?' అడిగాడు ఆనందన్.

సర్వెంట్ రెండు బ్రాందీ గ్లాసులు తెచ్చిపెట్టాడు బల్ల పైన.

'తీసుకోండి !' అన్నాడు మైత్రేయ.

ఆనందన్ గ్లాసు అందుకొని గటగట త్రాగాడు. మైత్రేయ రెండో గ్లాసు కూడా అందించాడు.

'మీరు ?' అడిగాడు ఆనందన్.

'మీ దాహం తీరనివ్వండి" అంటూ బలవంతం చేసి రెండో గ్లాసు కూడా అందించాడు. ఆనందన్ అందుకుని అది కూడా ఒక గ్రుక్కలో ముగించాడు.

'ఇప్పుడేమంటారు?' అడిగాడు గ్లాసు క్రిందపెడుతూ.

"అగ్ని జ్వాలలో క్రొత్త అమ్మాయిల్ని తీసుకో కూడదు. నా కథలు నా అనుమతి లేకుండా ఏవిధమైన మార్పులు చెయ్య కూడదు. అలా ఒప్పుకుంటే మీరు దాన్ని సినిమా తీసేందుకు నా కభ్యంతరం లేదు.' అన్నాడు మైత్రేయ.

"అలాగే ! మీ కండిషన్లకు ఒప్పుకుంటున్నాను." అన్నాడు ఆనందన్ కుర్చీలోంచి లేస్తూ.

" థాంక్స్ ।' చెప్పి, పోర్టికోదాకా సాగనంపాడు మైత్రేయ అతన్ని. అతని కారు వెళ్ళాక తిరిగి లోని కొచ్చాడు.

బ్రాందీలో విషం కలిపిచ్చాడు ఆనందస్వరూప. అది పని చెయ్యడం ప్రారంభించడానికి దాదాపు రెండు గంటల వ్యవధి వుంటుంది. పోస్టుమార్టమ్ చేసినా అంతకు ముందే తీసుకున్నట్లు ఋజువు అవుతుంది. అందువల్ల తన్ను ఎవ్వరూ అనుమానించరు.

ఈ విషం తయారు చేసే విధానాన్ని కొన్నాళ్ళ క్రితం ఒక అమెరికన్ మాగజైన్‌లో చదివాడు. అప్పట్లో తయారు చేశాడు. అనసూయకు దాన్ని ఇచ్చి చంపాలన్న ఊహ ఉందింది రోజుల్లో.

విషం తయారయ్యాక తన ఇంట్లో వున్న కుక్కకు ఇచ్చి చూశాడు. ఆ పత్రికలో రాసినట్లే రెండు గంటల తర్వాత చచ్చింది. ఆ తర్వాత అతనా ప్రయత్నం విర మించుకున్నాడు. ఆ మాగజైన్ కాపీ, తన లైబ్రరీలో భద్రంగా వుంచుకున్నాడు.

ఇంక కుమరన్, రామన్, వున్నారు. వాళ్ళను చంపడ మెలాగాని ఆలోచిస్తూ కూర్చున్నాడు. ముగ్గురూ వచ్చి వుంటే ఒక్కసారే తనపని పూర్తయ్యేది. వాళ్ళు రాక పోవటం ఒక విధంగా అతనికి నిరాశ కలిగించింది. అయినా వాళ్ళను వదలడం ఇష్టంలేదు. ఎలాగైనా తన కక్ష సాధించాలని తీర్మానం చేసుకున్నాడు.

సుశీలరూపం మెదలింది. ఆ ముగ్గురిమధ్య చిక్కు కొని మానరక్షణకు, ప్రాణరక్షణకు, ఆమె ఆక్రోశించడం, అల్లాడడం, అతని కళ్ళముందు ఊహాచిత్రాల్లా మెదిలాయి.

పిడికిళ్ళు బిగుసుకున్నాయి. రక్తం కళ్ళలోకి ఉబికింది.

రాత్రంతా నిద్రలేకుండా ఆలోచిస్తూ కూర్చున్నాడు.

6

తెల్లవారుతూండగా ఫోన్‌వచ్చింది. రామన్ ఫోన్‌లో వాళ్ళ అన్నగారైన ఆనందన్ అకస్మాత్తుగా చని పోయాడని చెప్పారు.

మైత్రేయ ఆశ్చర్యం ప్రకటించి, వెంటనే వస్తున్నా నని చెప్పాడు. అరగంటకల్లా ఆనందన్ బంగళాకు చేరు కున్నాడు. అప్పటికే జనం పెద్ద కోలాహలంగా మూగి వున్నారు. రామన్ మైత్రేయ దగ్గరకు వచ్చారు.

"ఎలా జరిగింది ?" అడిగాడు అమాయకంగా.

'అర్థంకావడం లేదు!' అన్నారు రామన్.

'ఏమైనా సుస్తీ 'చేసిందా?

'అలాటిదేమీ లేదు. రాత్రి పదింటిదాకా మేము ముగ్గురం మాట్లాడుకుంటూ కూర్చున్నాం. ఆ తర్వాత మేము వెళ్ళిపోయాం. పన్నెండింటికి ఫోన్ వచ్చింది. వచ్చి చూశాం. అప్పటికే అన్నయ్య చనిపోయాడు.' రామన్ చెప్పారు.

'ఆత్మహత్య చేసుకున్నాడేమో?'

'అన్నయ్యకలాంటి అవసరం లేదు!'

'ఎందుకైనా మంచిది. పోలీసుల్ని పిలవకపోయారా?' సూచించాడు మైత్రేయ యధాలాపంగా.

'అవసరం లేదు! దహనానికి అన్ని ఏర్పాట్లు చేశాం' అన్నాడు రామన్.

ఇంకొంతసేపు అక్కడే వుండి, తిరిగి ఇంటికి

వచ్చేశాడు మైత్రేయ.

అతనికి చాలా ఆనందంగా వుంది. మొదట హత్య, సులభంగానే జరిగి పోయింది. తర్వాత గురి రామన్ పైపు పెట్టాడు.

ఆ సాయంత్రం ఫోన్ చేసి రామన్ను రమ్మని చెప్పాడు. వాళ్ళ అన్నయ్య చని పోవడం గురించి, తన కున్నకొన్ని అనుమానాల్ని చెప్తానని చెప్పాడు.

సాయంత్రం రామన్ వచ్చాడు.

"ఏమిటి మీ అనుమానాలు?" అడిగాడు రామన్.

'మీ దగ్గర పని చేసే రాజు తన చెల్లెల్ని మీరు అన్నదమ్ములు ముగ్గురూ బలవంతంగా అనుభవించి, ఆ తర్వాత చంపి శవాన్ని కూంబివర్‌లో పడేశారని పోలీ సులకు చెప్పాడు గదూ.' అడిగాడు మైత్రేయ.

'అవును!'

"అతని మనుషులెవరన్నా మీ అన్నయ్యను హత్య చేశారేమోనని నాకనుమానంగా వుంది." అన్నాడు మైత్రేయ.

"వాడి మొహం! ఏదో వాడు తప్పించు కొనేందుకు అలా చెప్పాడు తప్ప, ఇంత దారుణం చెయ్యగలిగిన మనుషులెవ్వరూ వాడికి అంద వుండరు." అన్నాడు రామన్.

"అంటే వాడు చెప్పింది నిజమేనా?" అడిగాడు మైత్రేయ.

'అంతా అబద్దాలు! డబ్బుకు ఆశపడి, ఎవర్నో తీసు కొచ్చి వుంటాడు. వాళ్లు ఈ దారుణం చేసివుంటారు.' అంటూ జేబులోంచి చిన్న సీసా తీసి, అందులోంచి ఒక

తెల్లటి టాబ్లెట్ నోట్లో వేసుకున్నాడు.

"ఏమిటా టాబ్లెట్?" అడిగాడు మైత్రేయ.

"నాకు బ్లడ్ షుగర్ వుంది సార్. గంట కొక టాబ్లెట్ వేసుకోవాలి." అన్నాడు రామన్.

'ఈ వయస్సులోనే ఇంత దారుణమైన జబ్బా?'

'ఖర్మ! అంత కన్న మరేం చెప్పాలి?' అన్నాడు నిస్పృహగా.

'మీలాగే నాకూ వుంది. కానీ రోజుకు ఒక్క టాబ్లెట్ వేసుకుంటాను. అది రాత్రి పడుకోబోయే ముందు. అవి ఈ దేశంలో దొరకవు. అమెరికాలో దొరుకుతాయి. నా స్నేహితుడు పంపుతూ వుంటాడు' అన్నాడు మైత్రేయ.

'అలాంటిదేదన్నా వుంటే నాక్కూడా ఇవ్వండిసార్!' అన్నాడు రామన్.

'నా దగ్గర రెండు మూడు వున్నాయి. ఒక టాబ్లెట్ ఇస్తాను. ఈ రాత్రికి వేసుకుని చూడండి. బాగా పని చేస్తూ వుంటే మీక్కూడా తెప్పించి ఇస్తాను' అన్నాడు.

తన పని ఇంత సులభంగా జరిగిపోతున్నందుకు ఆనందపడ్డాడు మైత్రేయ. లోనికి వెళ్ళి, ఐదు నిముషాల తర్వాత తిరిగివచ్చి, చిన్నపొట్లం అందిస్తు 'మా సర్వెంటు ఇంట్లో వస్తువుల్ని ఉన్నచోట ఉండనివ్వడు. వెతికేసరికి నీరసం వచ్చింది' అన్నాడు మైత్రేయ

రామన్ పొట్లం అందుకొని జేబులో వేసుకుంటూ 'థాంక్స్!' అన్నాడు.

"ఎందుకయినా మీరు జాగ్రత్తగా ఉండటం మంచిది. నా అనుమానాలు నేను చెప్పాను.'' అన్నాడు మైత్రేయ.

"వస్తాను. మీవి కేవలం ఊహలు మాత్రమే!"
అంటూ వెళ్ళిపోయాడు రామన్.

7

ఉదయం నిద్ర లేచి కాలకృత్యాలు ముగించుకొని, ఆనంద్ స్టూడియోకు ఫోన్ చేశాడు. అక్కడ్నుంచి రెస్పాన్స్ లేదు. దాంతో అర్ధగంటకో మారు ఫోన్ చేస్తూనే వుండిపోయాడు. గంట పదయినా ఎవ్వరూ ఫోన్ తియ్యలేదు.

డైరక్టరీ వెతికి రామన్ వుండే యింటి నెంబరుకు ఫోన్ చేశాడు. అక్కడే వెంటనే ఫోన్ తీశారు.

"రామన్‌గారున్నారా?" అడిగాడు.

"మీ రెవరు?" అవతల నుండి జవాబు ప్రశ్న రూపంలో వచ్చింది

"మైత్రేయను. ఈ దినం కలుసుకుందా మన్నాడు. ఎన్నిగంటలకు, ఎక్కడ కలుసుకోవాలో అడుగుదామని...." అన్నాడు మైత్రేయ.

"ఆయన రాత్రి చనిపోయారు. ఇక్కడంతా వాళ్ళ బంధువులు, పోలీసులు, నిండి ఉన్నారు." అంటూ జవాబు కోసం ఎదురు చూడకుండా ఫోన్ కట్ చేశాడు అవతలవ్యక్తి.

మైత్రేయ గబగబ డ్రెస్ వేసుకుని, కారెక్కి రామన్ ఇంటివేపు పోనిచ్చాడు. ఆ యిల్లు చేరేందుకు పదిహేను నిముషాలు పట్టింది.

కారు దిగి జనాన్ని తప్పించుకుని మెల్లగా లోనికి వెళ్ళాడు. కుమరన్, మైత్రేయను చూడగానే, వడివడిగా

దగ్గరకొచ్చి, "అన్నయ్య లిద్దరూ అకస్మాత్తుగా చని పోయారు !" అన్నాడు.

'అవును. ఈ దినం కలుసుకుందా మనుకున్నాం.' అన్నాడు. మైత్రేయ కన్నీళ్ళు తుడుచుకుంటూ.

'అంతా విచిత్రంగా వుంది !'

'పోలీస్ కంప్లయింటు చేశారా ?'

"ఆఁ ! ఎందుకైనా మంచిదని నేనే చేశాను. శవాన్ని పోస్టుమార్టం చేస్తామంటున్నారు. మా అమ్మా, నాన్న వద్దంటున్నారు. నా కేమో చేయించాలని వుంది. పెద్ద న్నయ్య చనిపోతే ఏదో ప్రమాదమనుకున్నాను. ఇప్పుడు అలా అనుకోలేకుండా వున్నాను.' అన్నాడు కుమరన్.

'ఎవరో మీ మీద పగబట్టి నట్లువుంది. ఇక మిగిలింది నువ్వే. జాగ్రత్తగా వుండడం మంచిదను కుంటాను'. అన్నాడు మైత్రేయ.

'నా జోలికి వచ్చారంటే, వాళ్ళెవరైనా సరే, చిక్కి పోతారు. నా సంగతి తెలీదు.' గర్వంగా చెప్పుకొన్నాడు.

"ఇలా మీ పైన పగబట్టే అవసరం ఎవరి కన్నా వుందా?"

'మీరు వేసిన ప్రశ్నల్లాంటివే ఒక వంద వేశాడు ఇన స్పెక్టర్. మా కెవ్వరిపైనా అనుమానం లేదు.' అన్నాడు కుమరన్.

అంతలో ఇన్స్పెక్టర్ అక్కడికొచ్చి నిలబడి "నమస్తేసార్ !" అన్నాడు మైత్రేయను చూసి.

'వీరు మీకు తెలుసా ?' అడిగాడు కుమరన్.

"తెలుసు. రెండు రోజుల క్రితం స్టేషనుకొచ్చారు." మీదగ్గర పనిచేసే రాజుని చూడాలన్నారు. చూపించాను. అన్నాడు ఇన్స్పెక్టర్.

"రాజుమీకు తెలుసా?"

'తెలుసు. అతని చెల్లెలెవరో వుందని, ఆమెను ఎవరికైనా చెప్పి, సినిమాల్లో వేషాలు ఇప్పించాలని అడిగేవాడు. మీ ఆఫీసు దగ్గరే అతనితో పరిచయమైంది. అతని తాలూకు మనుషులెవరన్నా మీ పైన పగ పెట్టుకొని, ఈ హత్యాకాండ సాగిస్తున్నారేమోనని అనుమానంగా వుంది.' అన్నాడు మైత్రేయ.

'ఇవి హత్యలని మేము అనుకోవడం లేదు. అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"కులాసాగా తిరిగే ఇద్దరూ అకస్మాత్తుగా చనిపోతే వాట్ని ఏమనాలో నాకు తెలీడంలేదు. నా దృష్టిలో హత్యలనే అనిపిస్తున్నాయి.'.

'అయితే ఎవరు చేస్తున్నారంటారు?

"అది తెలుసుకోవలసింది మీరు." అన్నాడు. మైత్రేయ నవ్వుతూ ఇన్‌స్పెక్టర్‌తో.

'శవాన్ని పోస్ట్ మార్టం చేశాకగానీ, నేనెటూ నిర్ణయించుకోలేను.' అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఆ చర్య అంతటితో ముగిసింది. మైత్రేయ అందరి దగ్గర సెలవు తీసుకుని ఇంటికి తిరిగివచ్చేశాడు.

ఇంతదాకా తన పైన ఎవ్వరికీ ఏ విధమైన అనుమానం రాకుండా ఇద్దర్నీ హత్య చెయ్యగలిగాడు. ఇప్పుడు పరిస్థితులు చాలా వరకు తారు మారయిన విషయం గమనించాడు. మొదటిది పోలీసులు రంగంలోకి ప్రవేశించడం. రెండవది రామన్ శవాన్ని పోస్ట్ మార్టం చెయ్యడం. అది జరిగాక రామన్‌కు విష ప్రయోగం జరిగిందనీ తెలుసుకోవడం వాళ్ళకు అంత

పెద్దసమస్య కాదు. ఆ ప్రయోగం ఎవరు చేసి వుంటారా అన్న అనుమానముతో, రామన్‌కు తెలిసిన అందర్నీ, అంటే వాళ్ళతో పాటు తననూ సందేహించ వచ్చునన్న విషయం విదితమైంది మైత్రేయకు.

పోలీసుల పరిశోధన ఎక్కువ దూరం పోయి, అనుమానం తన దాక రాకముందే కుమరన్‌ను మట్టు పెట్టాలి. అలా చెయ్యకుంటే ఆ అవకాశం, పూర్తిగా జారి పోయే ప్రమాదముందనిపించింది.

కుమరన్‌ను ఆ రాత్రికి అతని మకాంలోనే మట్టు పెట్టాలని నిర్ణయించుకున్నాడు.

8

రాత్రి పన్నెండయింది.

మైత్రేయ నల్ల పాంటు, కోటు ధరించాడు. నల్లటి మఫ్లర్ మెడచుట్టూ చుట్టుకున్నాడు. చేతులకు నల్లటి గ్లోవ్స్ ధరించాడు. విషం సీసా జేబులో వేసుకున్నాడు. అరంగుళాల బ్లేడున్న స్టెయిన్ లెస్ స్టీల్ బిచ్చువా, జాగ్రత్తగా కాగితంలో చుట్టి లోపలి వైపున్న కోటు జేబులో దాచుకున్నాడు.

ఆ రోజు సాయంత్రం తన నవల సినిమా తీసే వుద్దేశ్యం వుందో, లేదో, తెలుసు కోవాలన్న మిషతో కుమరన్ వుంటున్న యింటికి వెళ్ళి వచ్చాడు. ఆ యింటి పరిసరాలు బాగా ఆకళింపు చేసుకున్నాడు.

ఆ యింట్లో కుమరన్‌తో పాటు ఒక పనివాడున్నాడు. అతని మంచి చెడ్డలు ఆ పని వాడు చూస్తూ వుండాలని పించింది. రాత్రిళ్లు గూడా వాడు అక్కడే వుంటాడని,

వాడి బట్టలు, మాట్లాడే తీరుని బట్టి ఊహించాడు.

మైత్రేయ, కుమరన్ ఇంటికి వెళ్ళే సరికి, పోస్ట్ మార్టం రిపోర్టు అందటంతో, అందులోని వివరాలు చెప్పాడు కుమరన్. దారుణమైన విష ప్రయోగం వల్ల రామన్ చని పోయినట్లు తేల్చారు. విషప్రయోగం ఎన్ని గంటలకు జరిగిందీ డాక్టర్లు అంచనా వేయలేక పోయా రని కూడా చెప్పాడు కుమరన్.

ఆ పాయింటుతో మైత్రేయకు కొంత ధైర్యం కలి గింది.

పోలీసులు తమ దర్యాప్తు ప్రారంభించారని కూడా తెలుసుకున్నాడు కుమరన్ ద్వారానే.

మైత్రేయ తన ఇంట్లోనించి, పనివాడికంట బడకుండా బైటకు చేరుకున్నాడు. కొంతదూరం నడచి, ఒక ఆటో మాట్లాడుకుని, నుంగంబాకం స్టేషనుకు పోనిమ్మన్నాడు. అదీగాక డబ్బులిచ్చి ఆటోని పంపించి వేశాడు.

ఆటోదూరంగా వెళ్ళిపోయాక మెల్లిగా నడచుకుంటూ బయలుదేరి, ఐదారురోడ్లు దాటి, కుమరన్ ఇంటికి చేరు కున్నాడు.

మేడమీద గదిలో మాత్రం లైట్లు వెలుగుతున్నాయి. క్రిందంతా చీకటిగా వుంది. పొట్టిగావున్న కాంపౌండ్ గోడ దూకి లోనికి చేరుకున్నాడు.

పోర్టికోలో, చాప వేసుకుని, పనివాడు పడుకుని గుర్రు పెడుతుండటం చూశాడు. లోపలి కెళ్ళేందుకు దారికోసం చూశాడు. తలుపులు మూసి తాళం వేసివున్నాయి. అంటే తాళాలు పనివాడు దగ్గర పెట్టుకొని వుండాలని పించింది.

అడుగులో అడుగు వేసుకొంటూ వెళ్ళి, అతని తల క్రింద చెయ్యిపెట్టి వెతికాడు. రెండోచెయ్యి, లోపలున్న బిచ్వా పైన వుంది.

తాళాలగుత్తి చేతికందింది. దాని సాయంతో తాళం కప్పతీసి లోనికి అడుగుబెట్టాడు. మెల్లిగా వెతుక్కుంటూ చీకట్లోనే మెట్లవైపు నడిచాడు. రైలింగ్ ఆధారంగా ఒక్కొక్క మెట్టే పైకెక్కాడు మైత్రేయ. పై భాగం చేరగానే, లైటు వెలుగుతున్న గదివేపు నడిచాడు. నడవ లోనికి తెరచి వుంచిన ఫ్రెంచి విండో గుండా వంగి చూశాడు.

కుమరన్ మత్తుగా పడుకున్నాడు. అతని తల నగ్న మైన ఓ అందమైన సుందరి పొట్టపై నుంది. ఆమె కూడా నిద్రలో జోగుతోంది.

కుమరన్‌ను చూడగానే రక్తం ఉడుకెక్కింది. కిటికీ గుండా మెల్లిగా లోనికి దూకాడు మైత్రేయ. స్విచ్‌బోర్డు కున్న పియానో స్విచ్ నొకదాన్ని అర్పాడు. లైటు ఆరి పోయింది. గదంతా చిమ్మచీకటి కమ్ముకుంది బిచ్వాతీసి, మంచం వైపు నడిచాడు.

పడుకున్న ఆకారం పైకి లేస్తున్నట్లనిపించింది. కళ్ళు చిట్లించుకుని చూశాడు మైత్రేయ. ఆ ఆకారం ఆ అమ్మాయిదని తెలుసుకున్నాడు.

క్షణం వ్యర్ధం గాకుండా బిచ్వాతో కుమరన్ గుండెల్లో పొడిచాడు. కుమరన్ 'అమ్మ' అంటూ బాధగా అరిచాడు।

ఆ అమ్మాయి "దొంగ దొంగ" అంటూ అరచింది. వెనుదిరిగి చూడకుండా, కిటికీ గుండా నడవాలోకి

దూకాడు. అక్కడ్నించి మెట్లు దిగాడు. అతని వెనుక వడివడిగా లైట్లు వెలిగాయి.

ఆ కాంతి కన్ను ముందు దూసుకు పోవాలని వ్యర్థ ప్రయత్నం చేశాడు. క్రిందున్న తలుపునెట్టాడు అది తెరచుకోలేదు. అప్పటికే వెనుక నుంచి ఆ అమ్మాయి తరుముకుంటు వచ్చింది.

మైత్రేయను చూడగానే కెవ్వుమని కేక పెట్టింది. ఠక్కున ఆమె పైకి దూకి గొంతు పట్టు కున్నాడు.

'అరిస్తే చంపేస్తాను!' అన్నాడు మైత్రేయ.

అరవనన్నట్లు సంజ్ఞ చేసింది ఆ అమ్మాయి.

ఉన్నట్టుండి తలుపులు తెరచుకున్నాయి.

ఎదురుగా కుమరన్ పనివాడు, పోలీసులు కనిపించారు.

మైత్రేయ బిక్క చచ్చిపోయాడు.

ఇన్‌స్పెక్టర్ పైకి పరుగెత్తాడు. కుమరన్ అప్పటికే చనిపోయాడు. తిన్నగా క్రిందకు దిగివచ్చాడు.

"మిస్టర్ మైత్రేయా! నిన్ను అనుమానించాను. కానీ రావడం లేటయింది" అన్నాడు.

మఫ్లర్ తీసి పడేస్తూ 'వీళ్లు" ముగ్గురూ నరరూప రాక్షసులు. నా కూతురి శీలాన్ని దోచుకుని, ఆమెను చంపి పారేశారు. వాళ్ళ పైన అందుకే పగ బట్టాను. కక్ష తీర్చు కున్నాను." అన్నాడు.

"ఆ విషయాలన్ని తెలుసుకున్నాం రాజును కలుసు కున్నాక అతని గదికి వెళ్ళగం, అక్కడి ఫోటోలు తీసు

కోవడం, ఆనందన్, రామన్ మీ ఇంటికి రావడం, ఇవన్నీ తెలిశాక, హంతకుడు నువ్వు తప్ప వేరే ఎవ్వరూ కాదని తెలుసుకొన్నాం. ఆ అమ్మాయి పెద్దగాఅరవడంతో వెలుపల్నించి, అతను తలుపులు మూశాడు. అప్పుడే మేము వచ్చాం!" అన్నాడు ఇన్‌స్పెక్టర్, మైత్రేయకు సంకెళ్ళు బిగిస్తూ.

(ఐపోయింది)